క్లుప్తంగా

కాశీవిశ్వేశ్వరుని సేవలో ఇల్లెందు జడ్జి



నున్న(విజయవాడరూరల్): తెలంగాణ రాష్ట్రం ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తిచంద్రికారెడ్డి దంపతులు సోమవారం నున్న గ్రామంలోని శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం కావడంతో స్వామి వారికి అభిషేకం చేసి ఉత్తర ద్వారంలో దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన భోగిపండుగ వేడుకలలో శ్రీ యేగీశ్వర్ దేవిదయాళ్ జ్యోతిర్లింగ్ దేవస్థానం అధిపతి స్వామి అమిత్ దేవ్‌జీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ మామిళ్లపల్లి ఫణికుమార్ భక్తులు పాల్గొన్నారు.

పండుగ రోజూ కొనసాగిన నిరసన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పని చేస్తునన చెత్త ఎత్తే వ్యాన్ డ్రైవర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో కుటుంబ పోషణకు బిచ్చమెత్తుకునే పరిస్థితి వస్తుందని వ్యాన్ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాన్ డ్రైవర్లు చేస్తున్న సమ్మెలో సోమవారం నాలుగో రోజుకు చేరింది. కామయ్యతోపు సెంటర్‌లో సీపీఎం నేతలతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. వ్యాన్ డ్రైవర్లు మాట్లాడుతూ గత 3 నెలలుగా వ్యాన్ డ్రైవర్లకు ప్రభుత్వం జీతాలు చెల్లించటంలేదన్నారు. జీతాలు ఇస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ భవాని ప్రసాద్ హామీ ఇచ్చారన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువజన సంఘ నాయకుడు వీసం సోమశేఖర్ మాట్లాడుతూ వ్యాన్ డ్రైవర్లకు అన్ని యువజన సంఘాలు మద్దతుగా నిలుస్తాయన్నారు. వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీతాలు ఇచ్చే వరకు ఆందోళణ కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు షేక్ మస్తాన్‌వలి, వెంకటరెడ్డి, నరసింహారావు, శ్రీహరి, లింగయ్య, సత్రం శ్రీను, పలువురు పాల్గొన్నారు.

కాలు దువ్విన పుంజులు

- భోగి రోజు కోడిపందేలతో రక్తం చిందిన బరులు
- హైకోర్టు ఆదేశాలు బేఖాతర్
- కనిపించని అధికారులు
- నిర్వాహకులు, పోటీదారులు, వీక్షకులతో కిటకిటలాడిన బరులు



తెంపల్లిలో కోడి పందేలు వేస్తున్న పందెం రాయుళ్లు

పెనమలూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ముఖ్యపండుగైన సంక్రాంతి సందర్భంగా సోమవారం భోగి పండుగ రోజు కోడి పందేల బరులలో రక్తం చిందింది. ఆరునూరైనా కోడి పందేలు ఆపుతామని, అసాంఘిక శక్తులను నియంత్రిస్తామని వారం రోజులుగా ఊదరగొట్టిన అధికారులు కనుచూపు మేరలో కూడా కనబడలేదు. నిర్వాహకులు హైకోర్టు ఆదేశాలు బేఖాతర్ చేశారు. భారీగా కాసులు చేతులు మారటంతో కోడిపందేలు పెద్ద ఎత్తున నిర్వహించారు.

కానరాని కమిటీలు..

మండల పరిధిలో సంక్రాంతి సంబంరాలలో కోడి పందేలు, జూద క్రీడలు జరగనివ్వమని మండల టాస్కుఫోర్స్ అధికారులు, రెవెన్యూ, పోలీసులు చాలా హడావుడి చేశారు. పైగా నోటీసులు ఇస్తున్నట్లు ఫొటోలకు ఫోజులు ఇచ్చారు. తీరా సంక్రాంతి పండుగకు ఒక రోజు ముందే భోగి పండుగ నాడు కోడి పుంజుల పోరుకు తెరలేపారు. యనమలకుదురులో చిన్నకట్ట వద్ద వేసిన బరిలో కత్తి కట్టిన పందెం పుంజులు వీరోచితంగా పోరాడి రక్తం చిమ్మి నేలకొరిగాయి. కూటమి నేతలు బరి తెగించటంతో కోడిపందేల శిబిరాల్లో అరుపులు కేకల మధ్య కోడి పందేలు పెద్ద ఎత్తున జరిగాయి. కోర్టు ఆదేశాలను ఏమాత్రం లెక్క చేయకుండా కోడి పందేలు నిర్వహించారు.

ఇతర జూద క్రీడలు కూడా..

ఇతర జూద క్రీడలు కూడా నిర్వహించారు. పెద్ద ఎత్తున సొమ్ము చేతులు మారింది. పందేలు కట్టిన జనాలు సొమ్ము పోగొట్టుకుని నిరాశతో వెనుతిరిగారు. అధికారులు మాత్రం కోడి పందేల శిబిరాల వైపు కన్నెత్తి చూడలేదు.

కథ అడ్డం తిరిగింది..

ఇక పెదపులిపాక, పోరంకిలో కోడి పందేల శిబిరాలకు ఆదరణ అంతగా కనబడలేదు. జనాల నుంచి సొమ్ము దోచుకోవాలని కూటమి నేతలు వేసిన పథకం బెడిసికొట్టింది. జనాల వద్ద సొమ్ములేక వారు ముందుకు రాక పోవటంతో పందేలలో పాల్గొనలేదు. ఈ రెండు శిబిరాలలో అంతగా జనాలు కనబడక పోవటంతో నిర్వాహకులు బెంబేలెత్తారు. పెట్టిన పెట్టుబడైనా వస్తుందా లేదా అని కూటమి నేతలు కంగారు పడుతున్నారు. కాగా మండల పరిధిలో పెనమలూరు, చోడవరం ప్రాంతాల్లో కూడా కోడి పందేలు జరిగాయి.

జూదాల వేదిక..

గన్నవరం రూరల్: తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లో జోరుగా జూదాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మండలంలో సూరంపల్లి సమీపంలోని వెంచర్‌లో క్యాసినో తరహాలో కోడిపందేలు, పేకాట ఇతర జూదాలు జరిగాయి. గోపవరపుగూడెం, పురుషోత్తపట్నం రైల్వే గేటు సమీపంలో, చిన అవుటపల్లి, తెంపల్లి గ్రామాల్లో కూడా బరులు ఏర్పాటు చేసి పందేలు నిర్వహిస్తున్నారు. పేకాట, కోడి పందేలతో పాటు పులి ఏనుగు, చిన బజార్, పెద్ద బజార్, హీరో, హీరోయిన్ బొమ్మలతో గుండాట లాంటి జూదాలు యథేచ్ఛగా జరిగాయి. మండలంలో లక్షల్లో చేతులు మారాయి.

గన్నవరం: గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం నుంచి కోడి పందేలు, పేకాట వంటి జూద శిబిరాలు ప్రారంభమయ్యాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఈ ఏడాది 18 చోట్ల పెద్ద ఎత్తున్న జూద శిబిరాలను ఏర్పాటు చేశారు. హైకోర్టు తీర్పుకు విరుద్ధంగా కోడి పుంజులకు కత్తులు కట్టి బహిరంగంగా పందెలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో అంపాపురం, రామవరప్పాడు, ఎనికేపాడు, సూరంపల్లిలో భారీ స్థాయిలో ఏర్పాటైన శిబిరాల్లో తొలిరోజే రూ. కోట్లలో పందేలు జరిగాయి. ఈ జూద శిబిరాలపై ఆదివారం నామమాత్రపు దాడులు చేసిన పోలీసులు సోమవారం పత్తా లేకుండా పోయారు. దీంతో గ్రామాల్లో సైతం బహిరంగంగా కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూద కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గన్నవరం ప్రాంతంలో చెంచులకాలనీ, వీఎన్.పురం, మర్లపాలెంలో కోడి పందేల బరులు, పేకాట శిబిరాలను కూటమి ప్రభుత్వ నేతలు ప్రారంభించారు. గోపవరపుగూడెం, తెంపల్లి, చిన్నఆవుటపల్లిలో బహిరంగంగా కోడి పందేలు నిర్వహిస్తున్నారు. సూరంపల్లిలో హైటెక్ హంగులతో ఏర్పాటు చేసిన జూద శిబిరంలో భారీగా కోడి పందేలు, పేకాట, గుండాటలు సాగుతున్నాయి. గన్నవరం, నున్న, విజయవాడ ప్రాంతాల నుంచి జూదరులు పెద్ద ఎత్తున్న తరలిరాడంతో రూ.కోట్ల రూపాయిలు చేతులు మారుతున్నాయి.

ఉంగుటూరు: మండలంలో నందమూరు, ఉంగుటూరు, కొయ్యగూరపాడు గ్రామాల్లో జోరుగా జూదం కొనసాగింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కోడి పందేలు తిలకించేందుకు వచ్చారు. అక్కడ ఏర్పాటు చేసీన పేకాట, గుండాట వంటి జూద క్రీడల్లో పాల్గొని జేబులు గుల్ల చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా జోరుగా జూద క్రీడలు సాగుతున్నా పోలీసులు కన్నెత్తి చూడక పోవడాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. తమ క్రీడలకు అనుమతులు ఉన్నాయని నిర్వాహకులు చెప్పడం గమనార్హం.



పెనమలూరు బరిలో తలపడుతున్న పుంజులు



పెనమలూరులో కోడి పందేల శిబిరం



యనమలకుదురులో కోడిపందేల శిబిరం

కాయ్ రాజా..కాయ్..

- అంపాపురంలో యథేచ్ఛగా భారీ జూదశిబిరం
- జూదప్రియులకు సకల హంగులు ఏర్పాటు
- ఎంట్రీ పాస్లు, ప్రత్యేక టికెట్‌లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సంక్రాంతి సంప్రదాయం ముసుగులో పందెంరాయుళ్ల భారీ జూదానికి తెరలేపారు. బాపులపాడు మండలంలోని అంపాపురంలో తెలుగుతమ్ముళ్ల భారీ జూదశిబిరాన్ని సోమవారం ప్రారంభించారు.

20 ఎకరాల విస్తీర్ణంలో..

చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో సుమారు 20 ఎకరాల సువిశాల ప్రాంగణంలో గ్యాంబ్లింగ్ గ్యాంగ్ భారీ ఏర్పాట్లతో జూదశిబిరాన్ని ఏర్పాటు చేశారు. జూదగాళ్లతో జతకట్టిన అధికార కూటమి నేతలు యథేచ్ఛగా పండుగ పేరుతో జూదం పేకాట, కోడి పందేలు, కాయ్ రాజా కాయ్, గుండాట వంటి పలురకాల జూదక్రీడలను ఈ శిబిరాల్లో ఏర్పాటు చేశారు. జూదప్రియులకు ఏలాంటి అసౌకర్యం కలగకుండా సకల హంగులను సిద్ధం చేశారు. కోడి పందేలు, పేకాట కోసం వీఐపీ, జనరల్ బరులు వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ప్రధాన బరిలో కోడి పందేలను తిలకించేందుకు గ్యాలరీలు, భారీ ఎల్ఈడీ స్క్రీన్లు సైతం ఏర్పాటు చేశారు.

ఒకే చోట 26 బరులు..

వందలాది ఖరీదైన కార్లు ఈ జూదశిబిరం వద్ద ఉండటం విశేషం. ప్రధాన బరితో పాటుగా మరో 6 కోడి పందేల బరులు, 10 పేకాట కోసులు, 10 గుండాట, కాయ్ రాజా కాయ్ శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రధాన బరిలో ఒక్కో పందెం విలువ రూ.10 లక్షల పైమాటే. శిబిరాల్లో క్షణాల వ్యవధిలోనే కోట్ల రూపాయాలు చేతులు మారిపోతున్నాయి.



అంపాపురం బరిలో లోనా బయట ఆడుతున్న దృశ్యం

ప్రత్యేక పాస్‌లు, ఎంట్రీ టిక్కెట్లు..

పందెం రాయుళ్లకు స్నాక్స్, బిర్యానీ వంటి ఆహారాన్ని నిర్వహకులే వండి సరఫరా చేస్తున్నారు. వీఐపీ పందెం బరుల్లోకి వెళ్లేందుకు ప్రత్యేక పాస్‌లు ఇవ్వగా, జూదశిబిరంలోకి రూ.50 ఎంట్రీ టిక్కెట్ వసూలు చేస్తున్నారు. బిర్యానీ, చికెన్ పకోడీ, గుట్కా, మద్యం, శీతల పానీయాల దుకాణాలను ఏర్పాటు చేశారు. రాత్రి వేళ్లలో కోడి పందేలు, పేకాట నిరాటంకంగా నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. అడుగడుగునా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, బాడీ గార్డులను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.



కంకిపాడులో బహుమతులు అందిస్తున్న రాఘవ

కంకిపాడు బరిలో కొట్లాట

కంకిపాడు: కంకిపాడు బైపాస్ వెంబడి టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోడి పందేల బరిలో పందెం రాయుళ్ల మధ్య చిన్న వాగ్వాదం చిలికి చిలికి గాలి వానలా మారి కొట్లాటకు దారి తీసింది. నిర్వాహకులు వివాదాన్ని సమసేలా చేయటంలో విఫలమయ్యారు. అక్కడే విధుల్లో ఉన్న ఓ కానిస్టేబుల్ పైనా నిర్వాహకులు దురుసుగా వ్యవహరించటం వివాదాస్పదం అయ్యింది. మద్యం మత్తులో పందెం రాయుళ్లు రెచ్చిపోయి తీవ్ర పదజాలంతో దుర్భాషలాడుకున్నారు.

బుల్లితెర టీం హల్ చల్..

కంకిపాడు బరిలో బుల్లితెర టీం హల్ చల్‌చేసింది. రాకెట్ రాఘవ బృందం బరిలో పాల్గొంది. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, ఫ్యాన్సీడ్రెస్ పోటీలు, ఫ్యాషన్ షోలో విజేతలైన మహిళలకు బహుమతులు అందించారు. అధికంగా పందేలు గెలిచిన మద్దూరు గోపి బృందానికి నిర్వాహకులు స్కూటీని బహుమతిగా అందించారు.

సంక్రాంతి సంబరాలు.. భోగి వేడుకలు

గన్నవరం రూరల్: మండలంలో భోగి పండుగను భక్తిశ్రద్ధలతో సోమవారం జరుపుకున్నారు. తెల్లవారు ఝాము నుంచే గ్రామాల్లో భోగి మంటలు వేసి సంక్రాంతి పండుగను ప్రారంభించారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి దీవించారు. సంప్రదాయ పద్ధతులను పాటిస్తూ పిండి వంటలు చేశారు. ఆలయాలను దర్శించి పూజలు చేశారు. చిక్కవరం శ్రీహనుమత్పుర క్షేత్రంలో విశేష పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంత చిన్నారులు వచ్చి సందడి చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు చిట్టినేని వంశీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వాకర్స్ ఆధ్వర్యంలో..

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో సోమవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి వేడుకలను నిర్వహించారు. వాకర్స్ సభ్యులందరూ సంప్రదాయ దుస్తులు ధరించి తెల్లవారుజామున క్రీడా ప్రాంగణానికి చేరుకున్నారు. భోగి మంటలు వెలిగించడంతో పాటు పాల పొంగళ్లు పొంగించారు. సంక్రాంతి పండుగ విశిష్టతను గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కేఎస్.జగదీశ్వరరావు వివరించారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్, న్యాయవాది తిరివీధి వెంకయ్య, కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాసరావు, కోశాధికారి డి.కోటేశ్వరరావు, పలువురు సీనియర్ వాకర్స్‌ను ఘనంగా సత్కారించారు. వాకర్స్ సంఘ నేతలు ఎస్.శ్రీనివాస్, ముక్కామల సుబ్బారావు, చిమట రామారావు, కేఎస్.బాబూరావు, చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వాకర్స్‌కు సంప్రదాయ వంటలైన అరిసెలు, పొంగలి, గారెలు, రేగిపళ్లు పంపిణీ చేశారు.

కంకిపాడు: మండలంలో తెల్లవారుఝామునే ఇళ్ల ముంగిట భోగి మంటలు వెలిగించి అందమైన రంగవల్లులను ప్రాంగణాల్లో తీర్చిదిద్దారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో సంక్రాంతిసంబరాలను జరుపుకున్నారు. హరిదాసులకు దానమిచ్చి పండుగను శ్రేణుల మధ్య ఘనంగా నిర్వహించారు. కోడిపందేలు, జూద క్రీడలకు దూరంగా ఉండాలని, సంప్రదాయంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు.



భోగి వేడుకల్లో పాల్గొన్న వాకర్స్



భోగి మంటలు వెలిగించి పూజలు చేస్తున్న జి.ప్రణీత్‌కుమార్, ఇతర నేతలు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

ఉంగుటూరు: పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం నాయకులు విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసీ దహనం చేశారు. ఎలుకపాడులో సీపీఎం మండలకార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు పాల్గొని తన నిరసన తెలిపారు. లంకపల్లి, ముక్కపాడు, మానికొండ, కొయ్యగూరపాడు, తరిగొప్పుల, పెద్ద అవుటపల్లి, వెన్నూతల గ్రామాలో విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసీ దహనం చేశారు. దుర్గారావు, ఎం.విశ్వేశ్వరరావు, వెన్నూతల సర్పంచ్ రామ్మోహన్‌రావు, సలీం, సత్యనారాయణ, ప్రభాకర్, పార్వతీశ్వరరావు పాల్గొన్నారు.

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం నేతలు భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి కార్మికనగర్‌లో సోమవారం వేకువజామున విద్యుత్ బిల్లులను భోగిమంటల్లో వేసి దహనం చేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా సభ్యుడు ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు విద్యుత్ చార్జీలు పెంచమని, బిల్లులు తగ్గిస్తామనిహామీ ఇచ్చారన్నారు. అయితే ఎన్నికలు ముగిసిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచి పేద, మధ్య తరగతి కుటుంబాలపై మోయలేని భారం మోపారని ఆరోపించారు. డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నిజస్వరూపం భయటపడిందని విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గించక పోతే ఆందోళణ తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నేతలు పుసునూరి పాతాళలక్ష్మి, వీసం సోమశేఖర్, లక్ష్మీనారాయణ, సీహెచ్.రాంబాబు, సీహెచ్.భవాని, దుర్గారావు పాల్గొన్నారు.



ఎలుకపాడులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

గన్నవరం: స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానం ప్రాంగణంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు గన్నవరం, విజయవాడ ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ శోభను సంతరించుకునే విధంగా రంగవల్లికలను తీర్చిదిద్దారు. అనంతరం న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.ఉమావతి, విశ్రాంత చిత్రలేఖనం ఉపాధ్యాయులు డి.సాంబశివరావు విజేతలను ఎంపిక చేశారు. మొదటి స్థానం సాధించిన కేసరపల్లి శివారు దుర్గాపురానికి చెందిన భవానికి రూ.10 వేలు నగదు బహుమతిని జాస్తి ఫణిశేఖర్ అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన అల్లాపురం గ్రామానికి చెందిన భవిష్యకు రూ.5 వేల నగదును ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, తృతీయ స్థానంలో నిలిచిన విజయవాడకు చెందిన మాధవికి రూ.3 వేలు కాసరనేని రంగబాబు సౌజన్యంతో అందించారు. కన్సొలేషన్ బహుమతుల కింద విజయవాడకు చెందిన మీనా, నాగదుర్గ, గన్నవరానికి చెందిన రత్నకుమారికి రూ.2 వేల చొప్పున కాసన్నేని వెంకటేశ్వరరావు (నాని), కొడాలి ఈశ్వర్‌ప్రసాద్, జాస్తి శ్రీధర్ అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



భవానికి రూ.10 వేలు నగదు బహుమతి అందజేస్తున్న ఫణిశేఖర్, శ్రీధర్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ఉంగుటూరు: మండలంలోని పెద్ద అవుటపల్లిలో ముత్తూట్ ఫిన్‌కార్ప్ గన్నవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు అధిక సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్నవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఫిన్‌కార్ప్ రీజినల్ మేనేజర్ బాల, ఏరియా మేనేజర్ కృష్ణ, బ్రాంచ్ మేనేజర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో చినకంచిలో గోదాదేవి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. సోమవారం ఆరుద్ర నక్షత్రం కావడంతో తెల్లవారు జామున రెండు గంటల నుంచి ఈశ్వరునికి అభిషేకం చేసి అన్నాభిషేకం చేశారు. పౌర్ణమి కావడంతో చండీ హోమం నిర్వహించారు. గోదాకల్యాణం చేసి భక్తులకు తీర్థప్రసాదములతో పాటు తలంబ్రాలు పంచారు. అన్నదానం చేశారు. వేదపండితులు ఇనుగంటి పవనకుమారశర్మ అర్చకులు ఫణీంద్ర, వేదవిద్యార్థులు కార్యక్రమాలను నిర్వహించారు. పెద్దిబోట్ల ఉమామహేశ్వరమ్ చండీ పారాయణం చేసి చండీహోమం చేశారు. శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో గోదాకల్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. భక్తులు కల్యాణోత్సవం తిలకించారు. తీర్థప్రసాదములు స్వీకరించారు. ఈ సందర్భంగా వైష్ణవాలయాల్లో గోదా కల్యాణం విశేషంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నున్న గ్రామంలోని తూర్పు, పడమర రామాలయాల్లో, బోడపాడు రామాలయం, విలేజి కంద్రికలోని రామాలయం, పి.నైనవరం గ్రామంలోని రామాలయంలో గోదా కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీగోదాదేవి అమ్మవారి శాంతి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణ స్వామివార్లకు సుప్రభాత సేవ, విశేష అర్చనలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తి గీతాలతో నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం జరిపారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా పుష్పమాలలతో అలంకరించిన పల్లకిపై భక్తులు కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. తొలుత ఎదుర్కోలోత్సవం నిర్వహించగా, 27 మంది దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు. సుముహూర్తంలో ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు నేతృత్వంలో శ్రీకృష్ణస్వామి, శ్రీగోదాదేవి అమ్మవార్లకు శాంతి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపారు. ధనుర్మాస గోష్ఠి సభ్యులు, పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.



చినకంచిలో గోదాదేవి కల్యాణం



అమ్మవారిని కల్యాణ వేదికపైకి తీసుకువస్తున్న భక్తులు